క్లుప్తంగా

జంబుకేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ



కనకాంబరాల అలంకరణలో జంబుకేశ్వరుడు

రాయదుర్గంటౌన్: అమావాస్యను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభు జంబుకేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. కనకాంబరాలతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అర్చకుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో అలంకరణ, పూజలు జరిగాయి. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చన చేపట్టారు.

అంజన్నకు అమావాస్య పూజలు



అలంకరణలో నేమకల్లు ఆంజినేయస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు గురువారం అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నేమకల్లుకు చెందిన ఎం.డి రాప్స్ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ అధినేతలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రూ.9 లక్షలతో కల్వర్టు నిర్మాణం



కల్వర్టు నిర్మాణపు పనులు జరుగుతున్న దృశ్యం

కూడేరు: మండలంలోని కమ్మూరులో పి.నాగిరెడ్డిపల్లికి వెళ్లే రోడ్డుకు గురువారం కల్వర్టు నిర్మాణానికి సర్పంచ్ చిన్న రంగారెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని కలసి కల్వర్టును నిర్మించాలని కోరారన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు కాగా అందులో రూ.9 లక్షలతో కల్వర్టు నిర్మిస్తున్నామన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి

కూడేరు: పిల్లలకు నాణ్యతతో కూడిన మధ్యాహ్నం భోజనం అందజేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఏజెన్సీ నిర్వాహకులకు కరుట్లపల్లి సర్పంచ్ ఓబుళమ్మ సూచించారు. గురువారం ఆమె కరుట్లపల్లి హైస్కూల్‌ను సందర్శించింది. విద్యా బోధన బాగా చేస్తున్నారా? రుచికరంగా భోజనాన్ని పెడుదుతున్నారా? అని విద్యార్థులతో ఆరా తీశారు. తర్వాత పిల్లలతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. తర్వాత ఉపాధ్యాయులను కలిసి పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

ఘనంగా 'హిందీ దివస్'



జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ హిందీ దివస్ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష ఆవశ్యకతను, గొప్పతనాన్ని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రోషన్‌బాషా వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు ప్రసాద్, స్వరూప, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లా స్థాయి జట్ల ఎంపిక

కళ్యాణదుర్గం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి జట్ల ఎంపిక చేయనున్నట్లు క్రీడల కో ఆర్డినేటర్ చల్లా కిరణ్ చౌదరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 15, 16 తేదీల్లో ఎంపికలు ఉంటాయన్నారు. నియోజకవర్గ స్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికలు పలు క్రీడా పోటీలలో పాల్గొంటారన్నారు. 15న బాలికలకు, 16న బాలురకు పోటీలు, ఎంపిక ఉంటాయన్నారు.

పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- నేటి నుంచి ఇంటింటా సర్వేకు శ్రీకారం
- ఈ నెల 30 నుంచి ప్రతి మండలంలో మెగా వైద్య శిబిరాలు
- 45 రోజుల పాటు క్యాంపుల నిర్వహణకు చర్యలు

డివిజన్‌లోని ఆస్పతులు, సచివాలయాల వివరాలు

గ్రామ/ వార్డు సచివాలయాలు	194
ప్రాథమిక వైద్య శాలలు	11
సీహెచ్‌సీలు	2
ఏరియా ఆస్పత్రి	1
జనాభా	5,96,251



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గం: పేదలందరికీ సంపూర్ణ వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. వైద్య రంగంలో ఇప్పటికే ఎన్నో సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించారు. ఇది వరకే అమలుచేసిన జగనన్న సురక్ష తరహాలాగే, ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల వద్దకు చేర్చేలా కార్యచరణ సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి వలంటీర్లు, గృహసారథులు, ప్రతినిధులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలసి ప్రతి గడపను సందర్శిస్తారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు వివరిస్తారు. అనంతరం కుటుంబంలో దీర్ఘకాల వ్యాధులు, ఇతర జబ్బుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. ఈ సర్వే ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా అధికారులు వలంటీర్లు, ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించారు.

వైద్య నిపుణుల పర్యవేక్షణలో..

డివిజన్‌లోని రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో గ్రామ/వార్డు సచివాలయాలు 194 ఉన్నాయి. వీటి పరిధిలోని 11 ప్రాథమిక వైద్యశాలలు, 2 సీహెచ్‌సీలు, 1 ఏరియా ఆస్పత్రి ఉన్నాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇప్పటికే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిం. ఈ నెల 30న గ్రామ/ పట్టణాల్లో హెల్త్ క్యాంపుల నిర్వహణ ప్రారంభమవుతాయి. 45 రోజుల పాటు ఈ క్యాంపుల ఏర్పాటుకు కార్యచరణ చేపట్టారు.

కార్యక్రమం అమలు తీరు ఇలా..

- ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేయడం
- అనారోగ్య సమస్యలు ఉంటే పరిష్కరించడం
- వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఆరోగ్య శాఖ షెడ్యూల్ తెలియజేస్తారు
- ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు
- అనారోగ్య వివరాలను కే షీట్‌లో నమోదు చేసి, ఫలితాలను వైద్యులకు అందుబాటులో ఉంచుతారు.
- వైద్య శిబిరం లో వైద్యులు పరీక్షించి రోగులకు ఉచితంగా మందులు అందజేస్తారు
- మెరుగైన వైద్యం కోసం రెఫర్‌చేసేలా యాప్ రూపొందించారు.

పకడ్బందీగా ఆరోగ్య సురక్ష



ఆరోగ్య సురక్ష సర్వే ప్రతి గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో పకడ్బందీగా నిర్వహించేలా కార్యచరణ చేపట్టాం. ఇప్పటికే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాం. శుక్రవారం నుంచి సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

– శంకర్, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం

పేదలు సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఏఎన్ఎం, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారు. 30 నుంచి ప్రతి మండలంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ లో మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించేలా చర్యలు చేపట్టాం. ప్రజలంతా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ సుజాత, హెల్త్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, కళ్యాణదుర్గం

సద్వినియోగం చేసుకోవాలి

రాయదుర్గంటౌన్/రాయదుర్గం రూరల్/కళ్యాణదుర్గం రూరల్: పేదలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న గొప్ప సంకల్పంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పిలుపునిచ్చారు. జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై గురువారం రాయదుర్గం మున్సిపల్ కార్యాలయంలో వార్డు వలంటీర్లు, సచివాలయ ఏఎన్‌ఎంలతో ఆమెతో పాటు కమిషనర్ దివాకర్‌రెడ్డి, యూపీహెచ్‌సీ వైద్యుడు అజార్‌ఖాన్ సమావేశం నిర్వహించారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ రైతు విభాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ ప్రభావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా హాజరయ్యారు. చైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, ఏఎన్‌ఎంలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, కౌన్సిలర్లు గౌని లావణ్య, శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, బషీర్ అహ్మద్, అరవా శివప్ప, గౌని శ్రీరామిరెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలంలోని 14 సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు సర్వే ఉంటుందని రాయదుర్గం ఎంపీడీఓ కొండయ్య పిలుపునిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, అగన్‌వాడీ కార్యకర్తలతో ఆయన అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మారుతి, ఏఓ చిక్కణ్ణ, ఐసీడీఎస్ సీడీపీఓ ప్రభావతి, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఎంఈఓ-2 వెంకటరమేష్ పాల్గొన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మెడికల్ ఆఫీసర్ రిహ జైనబ్ మాట్లాడుతూ ఈనెల 30న ఒంటిమిద్ది పరిధిలో, అక్టోబర్ 15న ఇందిరమ్మ కాలనీలో ఉన్న హెల్త్ క్లినిక్ పరిధిలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, నర్సులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



కణేకల్లు: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

కణేకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. చంద్రబాబు అండ్ కో ఐదేళ్ల పాలనలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడితే తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పేదలకు పంచిపెడుతోందన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో గురువారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కెనిగుంట రామిరెడ్డి, అశోక్‌తో కలిసి విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డినన్నారు. ఒక్కో ఇంటికి రూ.రెండు లక్షల నుంచి రూ.ఆరు లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు 2024 ఎన్నికల్లో దోపిడీదారులైన చంద్రబాబు, కాలవ శ్రీనివాసులను ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి టీడీపీ బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. కాగా యర్రగుంట గ్రామంలో ఇటీవల నిర్వహించిన సురక్ష సర్వేపై విప్ కాపు అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్వే తుతూ మంత్రంగా చేశారంటూ గ్రామ సచివాలయ అధికారులపై విప్ మండిపడ్డారు. చాలా మంది పొజిషన్ సర్టిఫికెట్లు, ఇళ్లు అడుగుతున్నారు... ఎవరికీ ఏమీ కావాలనే డిమాండ్ సర్వే మీ వద్ద సిద్ధంగా ఉండాలి.. అది లేక పోతే ఎలా అని ప్రశ్నించారు. శుక్రవారం నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య రక్ష సర్వేలో జగనన్న సురక్ష సర్వే కూడా చేపట్టి ఎవరికీ ఏం కావాలో గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మండల జేసీఏ కన్వీనర్ హనుమంతరావు, యర్రగుంట వైస్ సర్పంచు సునీతమ్మ, ఎంపీటీసీ నాగరాజు, పాటిల్ రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచు భీమప్ప, నాయకులు గొల్ల భీమిరెడ్డి, గౌని శ్రీనివాసరెడ్డి, పి.శ్రీనివాస రెడ్డి, సంజీవరెడ్డి, సోంశేఖర్‌రెడ్డి, కేజీ ఈరన్న, గోవర్ధన్‌రెడ్డి, కె.అశోక్, అనిల్‌కుమార్, పెద్దహనుమంతరాయుడు, చిన్నహనుమంతరాయుడు, ప్రకాష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప'లో అపూర్వ ఆదరణ

ఉరవకొండ: మండలంలోని రాకెట్లలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వానికి గురువారం అపూర్వ ఆదరణ లభించింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన మహిళలతో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా చేపట్టిన సంక్షేమ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధిపొందారో బుక్‌లెట్ అందించి వివరించారు. ప్రజల సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడి అక్కడే పరిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో ప్రతిపక్ష పార్టీలు పూర్తిగా నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ఆధారాల సహా అరెస్టయి జైల్లో ఉన్న చంద్రబాబుకు మద్దతుగా టీడీపీ నాయకులతో పాటు ప్రజలు కూడా ఎక్కడా రోడ్లు ఎక్కడం లేదన్నారు. ఎందుకంటే చంద్రబాబు తప్పుచేశాడు కాబట్టే జైలుకు వెళ్లాడని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. చంద్రబాబు అరెస్టుపై ఉరవకొండ ఎమ్మెల్యే కేశవ్ కూడా స్పందించడం లేదని, నియోజకవర్గంలో టీడీపీ క్యాడర్ నిరుత్సాహంగా మారిందన్నారు. కార్యక్రమంలో పెన్నహోబిళం మాజీ చైర్మన్ అశోక్, దెయ్యాల నాగరాజు, శ్రీనివాసులు, సర్పంచ్ శివమ్మ, ఉప సర్పంచ్ రామిరెడ్డి, రాకెట్ల నాయకులు నెట్టెం సురేష్, మదమంచి బాబు, ఆమిద్యాల సర్పంచ్ శ్రీరాములు, ఖాదర్‌బాషా, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు చెంగల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి బాటలు



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి బాటలు వేస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. పట్టణంలోని మారెంపల్లిలో కాలనీలో గురువారం 9, 10 వ వార్డుల్లో పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సభ్యులతో ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్యామల మహిళా సంఘం సభ్యురాలు లక్ష్మీదేవి, స్వయంకృషి మహిళా సంఘం సభ్యురాలు ముత్యాలక్క తదితరులతో జగనన్న అందిస్తున్న మహిళా సంక్షేమ పథకాలపై మంత్రి ఆరా తీశారు. వ్యక్తిగత రుణాలతో పాటు పొదుపు సంఘాల రుణాలు, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత తదితర పథకాలను వినియోగించుకుంటూ సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నామని గర్వంగా చెప్పారు. పిల్లల చదువుల కోసం అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విదేశీ విద్య వంటి పథకాలను అందిస్తున్నారన్నారు. మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాల అమలులో రాజకీయాలకు తావు లేకుండా పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా అందజేస్తున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 3,000 మందికి ఇంటి పట్టాలు అందించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, సీనియర్ నాయకుడు సుధీర్, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు హేమ, సచివాలయ కన్వీనర్లు ఉమేష్, షేక్షావలి, అరుణ, జిల్లా ఉపాధ్యక్షురాలు బిక్కి నాగలక్ష్మి, ఆర్‌పీలు కళ్యాణి, ధనలక్ష్మి, రేష్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

ఉరవకొండ: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించినపుడే క్రీడల్లో రాణిస్తారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సుగుణబాయి సూచించారు. గురువారం స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి అండర్-14,-17 బాలురు, బాలికల క్రీడా పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి పోటీల్లో క్రీడాకారులు రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు. అనంతరం ఎంఈఓ ఈశ్వరప్ప, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అక్కులప్ప, హెచ్‌ఎం వీరన్న, పీడీతో క్రీడలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షటిల్ బాట్మింటన్, టెన్నికాయిట్, బాల్ బాట్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు కొనసాగాయి. ఎస్‌జీఎఫ్ చైర్మన్, హెచ్‌ఎం వెంకటేశ్‌బాబు, ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్, కో ఆర్డినేటర్ నాగేంద్ర హాజరై క్రీడలను ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి విచ్చేసిన వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, షటిల్, బాల్‌బాట్మింటన్, యోగా క్రీడలను అండర్ -14, -17 విభాగాలుగా బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైభవంగా ఉరుసు

వజ్రకరూరు: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం హజరత్ సయ్యద్ మూరాద్‌షావలి ఉరుసు వైభవంగా నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు స్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి సమాధిని ప్రత్యేకంగా అలంకరించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

గొంతువాపు వ్యాధితో గేదెల మృతి

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన రైతులు కిరణ్, రాజుకు చెందిన ఐదు గేదెలు గురువారం మేతకు వెళ్లి మృతిచెందాయి. సచివాలయ పశుసంవర్ధక సహాయకుడు తిమ్మరాజు వెంటనే మండల పశువైద్యాధికారి రమేష్‌కు సమాచారం అందించి.. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పశువులకు పోస్టుమార్టం నిర్వహించి రక్త నమూనాలను కళ్యాణదుర్గం పశు వ్యాధి నిర్ధారణ శాలకు పంపించారు. గొంతువాపు వ్యాధి లక్షణాలతో పశువులు మృతిచెందాయని ప్రయోగశాల అధికారి హేమంత్ నిర్ధారించారని పశు వైద్యాధికారి తెలిపారు. రైతు కిరణ్‌కు రూ.70,000, రైతు రాజుకు రూ.30,000 వరకూ పశు నష్టం వాటిల్లిందన్నారు. నరసాపురం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని పశువైద్యాధికారి తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

బెళుగుప్ప: చిరుధాన్యాల వంటకాలతోనే ఆరోగ్యం సాధ్యమని ఏఎఫ్ ఎకాలజీ అదనపు జీవనోపాధుల జిల్లా కోఆర్డినేటర్ రిజ్వానా అన్నారు. గురువారం మండలంలోని వెంకటాద్రిపల్లిలో ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ కార్యాలయంలో చిరుధాన్యాల వంటకాల తయారీపై శిక్షణ తరగతులను యాగంటి కేవీకే నుంచి వచ్చిన ట్రైనర్స్ రాజ్యలక్ష్మి, లక్ష్మీదేవితో కలసి హోటల్స్ నిర్వాహకులు, మహిళలు, సస్యమిత్ర సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, ఊదలు, రాగి, సజ్జ, ఆరిక, జొన్న, వరిగ ధాన్యాలతో ఇడ్లీ, దోశలు, ఉప్మా, కిచిడీ, పకోడ, వడ, కొర్ర బిరియాని, పలావ్, చిత్రాన్నం వంటలను తయారు చేసి శిక్షణ ఇచ్చారు. ఏఫ్ ఎకాలజీ విభాగం అధికారులు సీబీఓ కోఆర్డినేటర్ భాస్కర్‌బాబు, ఎంటీఎల్ ఓబుళపతి, విష్ణు, సీబీఓలు తిప్పేస్వామి, బవాని, టీఏలు, ఎస్‌టీఓలు, కేకేఎస్‌లు, సస్యమిత్ర గ్రూపుల సభ్యులు పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లి ఫించన్ పంపిణీ

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లి పెద్దతండా(రూపానాయక్‌తాండా)గ్రామానికి చెందిన వలంటీర్ నాగరాజునాయక్ గురువారం బెంగళూరుకు వెళ్లి ఓ వృద్ధురాలికి నూతనంగా మంజూరైన పింఛన్ సొమ్మును అందజేశాడు. కమలాదేవి కొద్ది రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లింది. అనారోగ్యం కారణంగా అక్కడే కొడుకు సంపత్‌కుమార్ వద్ద ఉండిపోయింది. ఈనేపథ్యంలో వలంటీర్ నాగరాజు నాయక్ బెంగళూరుకు వెళ్లి ఆమెకు నూతనంగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ సొమ్ము రూ.2750 రూపాయలు అందచేశాడు. అలాగు ఆమె పేరుమీద నూతనంగా మంజూరు అయిన రేషన్ కార్డును కూడ అందజేసి ఈ-కేవైసీ చేయించాడు. వలంటీర్‌ను పలువురు అభినందించారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



కళ్యాణదుర్గం రూరల్: సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు,లబ్ధిదారులు



కంబదూరు: లబ్ధిదారులకు కొత్త పింఛన్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్/కంబదూరు/శెట్టూరు/బ్రహ్మసముద్రం/బొమ్మనహాళ్/కూడేరు: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో నూతనంగా పింఛన్ పొందిన లబ్ధిదారులు గురువారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ముదిగల్లు సచివాలయ పరిధిలో కొత్తగా 32 మందికి ఫించన్ పొందారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కంబదూరు పంచాయతీలోని సచివాలయం-1,2,3,4 పరిధిలో నూతనంగా మంజూరైన 105 కొత్త పింఛన్లను వైఎస్సార్‌సీపీ నాయకులు పంపిణీ చేశారు. రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్ సీనియర్ నాయకుడు ఐ.సుధీర్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. శెట్టూరు మండలంలోని చింతర్లపల్లిలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుక సొమ్ము పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండలంలోని బ్రహ్మసముద్రం, వేపులపర్తి, భైరవానితిప్ప, బొమ్మగానిపల్లి తదితర గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, రైతుసంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేషనాయక్ , సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సర్పంచ్ కవిత, మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. కూడేరు మండలంలోని కరుట్లపల్లిలో 30 మందికి నూతన పింఛన్లను రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ నిర్మలమ్మ, సర్పంచ్ ఓబుళమ్మ అందజేశారు.జల్లిపల్లిలో కొత్త పింఛన్‌దారులకు సర్పంచ్ ఉమామహేశ్వరి నగదు అందజేశారు.